సాక్షి నంద్యాల

గురువారం । 14 । ఆగస్టు । 2025



శోభాయమానం.. ఆరాధనోత్సవం

మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అశేష భక్తజనం మధ్యం బుధవారం అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు ఊరేగారు. 8లో▸



మన పండు' బ్రహ్మ'ండం!

బ్రహ్మజెముడు మొక్కకు కాసే పాపాసి కాయలు. డ్రాగన్ ఫ్రూట్‌కు తేడా ముళ్లు మాత్రమే. బ్రహ్మజెముడు పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 19,603
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 19,449

న్యూస్‌రీల్

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, సర్వజన ప్రభుత్వాసుపత్రి డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. బుధవారం యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థిస్థాయిలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. వైస్‌ప్రిన్సిపాల్, డాక్టర్లు రాజశేఖర్, కళావతి, హెచ్‌ఓడీలు లోకేశ్వరరెడ్డి, పద్మజ, డాక్టర్ నిరంజన్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వరదరాజస్వామి ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



ఆత్మకూరు: వరదరాజస్వామి ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి నీటిని ఎనిమిది చెరువులకు సరఫరా చేస్తున్నట్లు ఏఈ మురళీకృష్ణ, ప్రాజెక్టు చైర్మన్ పూజా మల్లికార్జునరెడ్డి తెలిపారు. వడ్ల రామాపురం, కురుకుంద గ్రామాల్లో వాగులు, వంకలు పొంగే అవకాశం ఉన్నందున పాఠశాల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఎవరూ వాగులు వెంట వెళ్లొద్దని సూచించారు.

దరఖాస్తు గడువు 20 వరకు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో పేద పిల్లలకు అందించాల్సిన 25శాతం మిగిలిన సీట్ల కోసం ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తులను ఈనెల 20 వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష అదనపు అధికారి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు సచివాలయంలో, www.csc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 25న విడుదల చేస్తామన్నారు. పాఠశాలలో ప్రవేశాలు ఆగస్టు 31 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఎంపిక లాటరీ పద్ధతిలో జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ 18004258599 నంబరును సంప్రదించాలన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను తెలుసుకుంటున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. అధికారులకు, వీవీపీలకు గ్యాలరీల ఏర్పాటు చేయాలని, వేడుకలకు హాజరయ్యే అందరికీ మంచినీటి వసతి కల్పించాలన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్వర్లు

నంద్యాల(అర్బన్): ఎరువుల్లో కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని అన్నపూర్ణ ఫెర్టిలైజర్స్, సుదర్శన్ ట్రేడర్స్‌లలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టార్లు, బిల్ బుక్స్, నిల్వలు, ఈ పాస్ మిషన్‌లో స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. హోల్‌సేల్, రిటైల్ డీలర్లు నిర్ణయించిన ధరలతోనే రైతులకు ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. డీఏఓ వెంట ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు ఉన్నారు.

అంగన్‌వాడీలకు 'యాప్'సోపాలు

- నత్తనడకన నెట్‌వర్క్
- పనిచేయని యాప్‌లు
- పెరిగిన పని ఒత్తిడి
- సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు



పాత ఫోన్‌లను సీడీపీఓ కార్యాలయంలో అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

ఆళ్లగడ్డ: పౌష్టికాహార పంపిణీ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు తదితర వాటిని అప్‌లోడ్ చేసేందుకు ఇచ్చిన వివిధ రకాల యాప్‌లతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆపసోపాలు పడుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన పక్కదారి పడుతోంది. 'పనిచేయలేమని ఫోన్లు మాకొద్దు' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఫోన్లు, సిమ్‌లు వెనక్కి ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోషణ్ ట్రాకర్, రాష్ట్ర యాప్ బాల సంజీవని, కిశోర వికాస్, మిషన్ వాత్సల్య, సఖి వంటి యాప్‌ల్లో నిత్యం డేటా నమోదు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు కొత్తగా పీఎంఎంవీవై యాప్‌లో వివరాలు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రతి నెలా కేంద్రాలకు పాలు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మిల్క్ యాప్‌తో పాటు ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కోసం ఉన్న యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఇంతవరకు ఏఎన్‌ఎంలు చేసే మాతృవందన పథకానికి సంబంధించిన యాప్ త్వరలో అంగన్‌వాడీలకు అప్పగించనున్నారు.

నెలకు 5 జీబీ డేటా!

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బాల సంజీవని యాప్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పోషణ ట్రాకర్ యాప్ లో కూడా నిత్యం అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇందు కోసం ఆన్‌లైన్ వర్క్ చేసేందుకు ప్రభుత్వం నెలకు 5 జీబీ డేటాను మాత్రమే ఇస్తోంది. అది అయిపోతే సొంతంగా రీచార్జ్ చేసుకుందామన్నా వీలుండదు. ఆన్‌లైన్ వర్క్ ఎప్పటికప్పుడు ఎందుకు చేయలేదని ఉన్నతాధికారులు వేధింపులు.. సూటిపోటి మాటలతో మానసికంగా కుంగిపోతున్నారు. బాలింతలకు పోషకాహారం ఇచ్చేందుకు ఆధార్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అయితే అనేక మంది బాలింతల ఫొటో ఆధార్ కార్డులో 12 నుంచి 15 సంవత్సరాల వయసులోది మాత్రమే ఉంటుంది. ఆ ఫొటోలోని ముఖ కవలికలను గుర్తు పట్టేందుకు యాప్ చాలా ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఒక్కో సారి ఫోన్‌లో డాటా చాలక ఆ ప్రక్రియ మధ్యలోనే నిలచిపోతోంది.

'రికార్డు' స్థాయిలో అవస్థలు

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు 15 రికార్డులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, పిల్లలు, బాలింతలు, గర్భిణులు నమోదు, ప్రీ స్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతిరోజు విధిగా నమోదు చేయాలి. మరో వైపు పిల్లల టీకాల రికార్డులు, విటమిన్ – ఏ రికార్డులు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శన రికార్డులు, నెలవారీ ప్రాజెక్టులు, హౌస్‌హోల్డ్ సర్వే రికార్డు, గ్రోత్ చార్ట్ తదితర రికార్డులు నమోదు చేయడంతో సమయం అంతా గడిచి పోతోంది.

ఇవీ కష్టాలు..

- కొత్త యాప్‌లను అప్‌లోడ్ చేసేందుకు 2జి ఫోన్లు పనిచేయడం లేదు.
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి.
- గర్భిణులతో పాటు ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వయసున్న తల్లులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇళ్ల వద్దకే పోషకాహారాన్ని అందిస్తోంది. ఇందులో పారదర్శకత కోసం లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నేషన్ (ముఖ ఆధారిత గుర్తింపు) ప్రవేశ పెట్టింది. సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో ఇబ్బందిగా మారింది.
- బాల సంజీవని, పోషణ్ ట్రాకర్ యాప్‌లలో నమోదు తర్వాతే సరుకులు అందించాలి. అయితే సెల్‌ఫోన్లు ఐదేళ్ల క్రితం 2జీ నెట్‌వర్క్‌తో ఇచ్చినవి కావడంతో ఆయా యాప్‌లు తరుచూ మొరాయిస్తున్నాయి.
- పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రిక్ తప్పనిసరి. నెట్‌వర్క్ సరిగా లేకపోయినా, లబ్ధిదారుల మొబైల్స్‌లకు మెసేజ్ బ్యాలెన్స్ లేక ఓటీపీ రాకపోయినా సరుకులు అందడం లేదు.
- కొత్త 5జీ ఫోన్లు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ స్పందన లేదు.

జిల్లాలోని	
అంగన్‌వాడీ కేంద్రాలు	1,620
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	43
0-6 నెలల శిశువులు	16,785
7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు	66,824
3-6 సంవత్సరాల్లోపు చిన్నారులు	42,104
గర్భిణులు	17,246
బాలింతలు	18,112



పాత ఫోన్లు సంచుల్లో కట్టిన దృశ్యం

ఒత్తిడికి గురవుతున్నాం



2 జీబీ ర్యామ్‌తో ఉన్న 2జీ నెట్‌వర్క్ సిమ్‌తో ఎప్పుడో ఐదు సంవత్సరాల క్రితం ఇచ్చిన సెల్ ఫోన్లతో ఇప్పుడు ఇచ్చిన కొత్త యాప్‌లతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. యాప్‌ల భారమైనా తగ్గించండి. లేదంటే 5జీ సెల్‌ఫోన్లు కాని, ట్యాబ్‌లు కానీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– ఉదయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు, దొర్నిపాడు

యాప్‌లు మొరాయిస్తున్నాయి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రెండు రకాల యాప్‌లు తరుచూ మొరాయిస్తున్నాయి. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో తంటాలు పడుతున్నాం. ఉన్న యాప్‌లతోనే ఇబ్బందులు పడుతుంటే మళ్లీ ఏఎన్‌ఎంలు చేసే పీఎంఎంవీవై పని కూడా అప్పగించడం దారుణం. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు పాత ఫోన్లను సీడీపీఓ కార్యాలయంలో అప్పగించాం.

– వసుంధర, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు

ఆటంకాలు ఇవీ..

- గతంలో అంగన్‌వాడీ కేంద్రాల దగ్గరే పోషకాహారం ఇచ్చేవారు. దీనిని టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్)గా మార్చారు. పాలు, కోడిగుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు సార్లు ఇంటి దగ్గరే అందిస్తున్నారు. రెండు సార్లు పోషక్ ట్రాకర్ యాప్‌లో వివరాల నమోదుకే ఎక్కువ సమయం పడుతోంది.
- బాల సంజీవనిలోని ఆరు రకాల వస్తువులు కలిపి ఒక కిట్‌గా లబ్ధిదారులకు అందించాల్సి ఉంటుంది. అవి ఇచ్చే సమయంలో ఫొటో పోషణ ట్రాకర్‌లో అన్‌లోడ్ అవుతుంది. అయితే జిల్లాలోని కాంట్రాక్టర్లు అంతా టీడీపీ నేతలే కావడంతో వారు సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదు.



కొత్తపల్లి మండలం బండినాయునిపాలెంలో నీట మునిగిన వరిపైరు

ఎడతెరపి లేకుండా వర్షాలు

నంద్యాల(అర్బన్): జిల్లాలోని పలు మండలాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 163.8మి.మీ వర్షం కురిసింది. కొత్తపల్లె మండలంలో అత్యధికంగా 20.4మి.మీ వర్షం కురియగా డోన్ మండలంలో అత్యల్పంగా 0.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా మిడుతూరు మండలంలో 16.4, రుద్రవరంలో 15.2, ఆత్మకూరులో 12.8, పగిడ్యాలలో 12.4, పాములపాడులో 11.4, జూపాడుబంగ్లా, నంద్యాల అర్బన్‌లో 10.2 మి.మీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో రైతులు సాగు చేసిన వరిపైరు నీట మునగింది. కురుస్తున్న వర్షాలతో పూత దశలో ఉన్న మినుము నేలకొరిగి పూత, పిందె రాలిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కుందూ నది ఉప్పొంగి ప్రవహిస్తోందని, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



మద్దిలేరువాగు వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

మట్టి విగ్రహాలు ఎంతో మేలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలోని ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 27వ తేదీ జరిగే వినాయక చవితి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగంతో పర్యావరణానికి పెను నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజలు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలన్నారు.



మట్టి వినాయకుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

25న వినాయక విగ్రహాల పంపిణీ...

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈనెల 25వ తేదీ నంద్యాల కలెక్టరేట్‌లో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా ఇస్తామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, ఏఈఈ రామకృష్ణ, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(అర్బన్): బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉన్నాయని, వాటిని తల్లిదండ్రులకు వివరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకట శేషాద్రి కోరారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ కబర్ధి సూచనల మేరకు స్థానిక న్యాయ సేవాసదన్‌లో బుధవారం జిల్లాలోని ప్రభుత్వ లైన్ డిపార్టుమెంట్లకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో చిన్నతనంలోనే ప్రెగ్నెన్సీ, ఎస్‌సీ, ఎస్‌టీ, పౌర హక్కుల రక్షణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కుల రక్షణ, అమలు పథకం 2015, ఆదివాసీలు, సంచార తెగలకు న్యాయం పొందే అవకాశాన్ని బలోపేతం చేసే పథకం 2025పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా.శాంతికళ, ఆర్ వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ పీ విజయ, డీసీపీఓ శారద, జిల్లా సాంఘీక సంక్షేమం, సాధికారత అధికారిణి బీ రాధిక, నంద్యాల ఏటీడబ్ల్యూఓ హుసేనయ్య, నంద్యాల జిల్లా సీఐ పీ గౌతమి, రెండు జిల్లాలకు చెందిన రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకటశేషాద్రి

రూ.82.79 కోట్ల ఉచిత పంటల బీమా విడుదల

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకం

- కేంద్రం వాటా బీమా నిధులు విడుదల
- చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం



కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం కింద ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే మరోసారి రూ.82.79 కోట్ల ప్రయోజనం కలిగింది. 2022 ఖరీఫ్, 2023 ఖరీఫ్, 2023-24 రబీ, 2024 ఖరీఫ్ పంటలకు సంబంధించి ఉచిత పంటల బీమా ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తం గత రెండు రోజులుగా విడుదలవుతోంది. ఈ పరిహారం కేవలం కేంద్ర ప్రభుత్వ వాటా మాత్రమే. కేంద్రం ద్వారా ఒక్కో రైతుకు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ప్రయోజనం చేకూరుతోంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల నుంచి ప్రీమియం రూపంలో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచిత పంటల బీమాను అమలు చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు బీమా వర్తింపజేయడంతో లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఉచిత పంటల బీమాను మరచిపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు బీమా పరిహారం విడుదలవుతుండటంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకుంటున్నారు. ఇదిలాఉంటే రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా పరిహారం విడుదల చేయడంలో చేతులెత్తేసింది. దీన్నిబట్టి చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతులపై ఉన్న అభిమానం ఏపాటిదో అర్థమవుతోంది.

ఉపాధిలో అక్రమాలకు 'ఫొటో' చెక్!

- ఇకపై రెండు ఫొటోలు దిగితేనే వేతనం
- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే కూలీ మంజూరు
- జిల్లాలో 2.05 లక్షల జాబ్ కార్డులు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ



నంద్యాల మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

నంద్యాల(అర్బన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమ హాజరు నమోదుకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉపాధి సిబ్బంది, టీడీపీ నాయకులు కలసికట్టుగా అవినీతి చేయలేరు. కూలీల హాజరు నమోదుపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం సరికొత్త యాప్‌ను తీసుకురావడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. జాబ్‌కార్డు ఉన్నటువంటి ప్రతి ఒక్కరి ఫొటోలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో సదరు ఉపాధి వేతనదారు పనికి వచ్చిన అనంతరం అతని ఫొటో(ఐరిస్) తీస్తారు. ఒకవేళ యాప్‌లో నమోదు చేసిన వ్యక్తి ఫొటోకు మ్యాచ్ అవ్వకుంటే నగదు చెల్లింపులు చేసేందుకు వీలుండదు. ఈ యాప్‌ను ఇటీవల క్షేత్రస్థాయిలో ప్రవేశ పెట్టింది. దీంతో మండల స్థాయిలో ఉండే ఉపాధి అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లుకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఉపాధి ఏపీవోలు పని జరిగే ప్రాంతాల్లో కూలీలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఒకరు తరఫున మరొకరు హాజరైతే!

జిల్లాలో 2,65,737 జాబ్ కార్డులు ఉండగా 5,00,513 మంది కూలీలుగా నమోదయ్యారు. యాక్టివ్ కార్డులు 2,15,195 ఉండగా 3,82,050 మంది పనులకు హాజరయ్యేవారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లును తొలగించి తమ వారిని నియమించుకుంది. ముఖ ఆధారిత హాజరు విధానంలో భాగంగా కూలీల ఫొటోలను సెల్‌ఫోన్లలో తీసుకుని జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థకు (ఎన్‌ఎంఎంఎస్)కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేసే కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఒకరు తరఫున మరొకరు హాజరైనట్లు చూపితే ఆన్‌లైన్‌లో హాజరు తీసుకోదు. దీంతో అటు ఉపాధి సిబ్బందికి, ఇటు కూటమి నాయకుల జేబులు నింపుకునే విధానానికి పెద్ద గండి పడినట్లు అవుతుంది.

పకడ్బందీగా పర్యవేక్షణ

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఉపాధి కూలీల అటెండెన్స్ ఫొటోలన్నింటినీ ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శి వెరిఫై చేసి రిపోర్టును ఎంపీడీఓలకు పంపించాల్సి ఉంది. మేట్, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధం లేని ఫొటోను అప్‌లోడ్ చేశారా.. పని ప్రదేశంలో లైవ్ ఫొటో కాకుండా పాతది పెట్టారా… ఫొటోలో ఉన్న వ్యక్తుల సంఖ్య, మస్టర్‌లో హాజరైన వ్యక్తుల సంఖ్యలో తేడా ఉందా అన్న వివరాలు గమనించాలి. మండల స్థాయిలో అన్ని గ్రామాల నుంచి ఒక రోజులో వచ్చిన మొత్తం ఫొటోల్లో కనీసం 20 శాతం లేదంటే గ్రామానికి రెండు ఫొటోల చొప్పున ఎంపీడీఓ కార్యాలయంలోని ఏపీఓ, కాంట్రాక్ట్ స్టాఫ్, పర్మినెంట్ స్టాఫ్ అదే రోజు పరిశీలించి నివేదికను కలెక్టర్, డీఆర్‌డీఓలకు పంపించాలి.

4 గంటల తర్వాతే ఫొటో అప్‌లోడ్

పని ప్రదేశంలో మొదటి ఫొటోను ఉదయం 6 గంటలకు తీసి అప్‌లోడ్ చేస్తే, అనంతరం 4 గంటల తర్వాత అనగా ఉదయం 10 గంటలకు ఫోన్‌లో మరోసారి ఫొటో అప్‌లోడ్ చేయాలని సిగ్నల్ వస్తుంది. ఆ తర్వాత ఫొటో అప్‌లోడ్ చేయకపోతే ఆరోజు కూలీలకు నగదు చెల్లింపులు ఉండవు. మూడు నెలలుగా వేతనదా రులకు నగదు చెల్లింపులు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నగదును విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టించింది. అయితే త్వరలో కొత్త విధానం ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో తమకు రావాల్సిన మూడు నెలలు వేతనాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఫొటో ఉంటేనే హాజరు



కూలీలు పనులు చేసే ప్రదేశంలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా రెండు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్పుడే వారికి వేతనం వస్తుంది. ఫొటో ఉంటేనే హాజరుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే కూలీలకు వేతనం రాదు. ఈజీఎస్‌లో అక్రమాలకు చెక్ పెట్టేందుకే గత నెలలో నూతన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

– సూర్యనారాయణ, జిల్లా డ్వామా పీడీ, నంద్యాల

క్లుప్తంగా

కుందూలో పడి..


రమణరెడ్డి (ఫైల్)

బండి ఆత్మకూరు: ప్రమాదవశాత్తూ కుందూనదిలో పడి దివ్యాంగుడు మృతి చెందాడు. మండల కేంద్రం బండిఆత్మకూరులో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన సగిలే రమణ రెడ్డి (59) తన ట్రైసైకిల్‌పై బస్టాండ్ నుంచి ఊరిలోకి వెళ్తున్నాడు. స్థానిక కుందూనది వంతెనపై వెళ్తుండగా ట్రైసైకిల్ అదుపు తప్పి నదిలో పడిపోయింది. స్థానికులు గమనించేలోపే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలించి నంద్యాల నందమూరి నగర్ వద్ద ఉన్న కుందూ బ్రిడ్జ్ వద్ద మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కుందూనది వంతెనకు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో తరచు ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

రూ. 5లక్షల నగదు అపహరణ

ఆలూరు రూరల్: బ్యాంకు నుంచి డ్రా చేసుకొని వెళ్తున్న రూ.5 లక్షల నగదుతో పాటు 5 గ్రాముల బంగారు కమ్మలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. హాలహర్వి మండలం మల్లికార్జున పల్లి గ్రామానికి చెందిన బాధితుడు గోపాల్ రెడ్డి నెల క్రితం గాలిమరల సంస్థకు పొలం విక్రయించాడు. ఆ నగదు తన ఖాతాలో జమ కావడంతో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలూరు స్టేట్ బ్యాంకు నుంచి రూ.5 లక్షల నగదు డ్రా చేసుకున్నాడు. నగల దుకాణం నుంచి కొనుగోలు చేసిన 5 గ్రాముల బంగారు, డ్రా చేసుకున్న నగదు సంచిలో ఉంచి తన అల్లుడుతో కలిసి స్కూటర్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఆలూరు సమీపంలోని పాండురంగ స్వామి ఆలయం వద్ద స్కూటర్ నిలిపి నగదు, ఆభరణాలున్న సంచిని దానిపై ఉంచి మూత్ర విసర్జనకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బ్యాగు మాయమైంది. చోరీ విషయాన్ని బాధితుడు ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


ఆరాధనోత్సవాలను తిలకిస్తున్న భక్తజనం


ఉత్సవమూర్తి ఉయ్యాలసేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

శోభాయమానం.. ఆరాధనోత్సవం

- అశ్వ వాహనంపై ఊరేగిన ప్రహ్లాదరాయులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి 354వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో 6వ రోజు బుధవారం ఉత్సవాలు రమణీయంగా సాగాయి. వేకువ జామున 5.30కు సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు, రాయరు పాదపూజ, మూలదేవర సంస్థాన పూజ, శ్రీరాఘవేంద్రస్వామి మఠం 13వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధనలు కనుల పండువగా సాగాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు.



విదూషి సంగీత కట్టి దాసవాణి

అశ్వ వాహనంపై విశ్వ మోహనుడు

బుధవారం రాత్రి 10 గంటలకు ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు అశ్వ వాహనంపై కడు వైభవంగా ఊరేగారు. మంగళ వాయిద్యాలు, దాస సాహిత్య మండలి మహిళల భజనలు, అశేష భక్త జనం హర్ష ధ్వానాల మధ్య శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో విహరించారు. అనంతరం చెక్క, వెండి, అంబారి, స్వర్ణ రథాలపై ఉత్సవమూర్తికి రథయాత్రలు నిర్వహించారు. ఈ వేడుకలో మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ శ్రీనివాస రావు, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధన సప్తరాత్రోత్సవాలు సందర్భంగా యోగీంద్ర మండపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన విదూషి సంగీత కులకర్ణి దాసవాణి, సుధా స్కూలు బృందం హరిదర్శన నృత్య రూపకం భక్తులను మంత్రముగ్ధులు చేసింది.

నేడు సర్వ సమర్పణోత్సవం

ఉత్సవాల ఆఖరిరోజు అయిన గురువారం సర్వ సమర్పణోత్సవం జరుగనుంది. ఏక కాలంలో పంచ వాహనాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు, రాఘవేంద్రులను శ్రీమఠం మాడ వీధుల్లో ఊరేగిస్తారు. ఉదయం అనుమంత్రాలయం తుంగభద్ర గ్రామం మృత్తిక బృందావన క్షేత్రంలో ఆరాధన వేడుకలు, రథయాత్ర నిర్వహిస్తారు.

సూక్ష్మ సేద్యం పరికరాల ఏర్పాటులో జాప్యం చేయొద్దు

- కంపెనీల ప్రతినిధులకు ఏపీఎంఐపీ పీడీ ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం మంజూరు చేసిన రైతులకు సత్వరం మెటీరియల్ సరఫరా చేయడంతో పాటు వారి పొలాల్లో అమర్చాలని, ఈవిషయంలో జాప్యం చేయొద్దని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసులు డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో డ్రిప్ కంపెనీల జిల్లా కో-ఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులు బిందు, తుంపర్ల సేద్యం కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారని, నాన్ సబ్సిడీ కూడా చెల్లిస్తున్నారని తెలిపారు. 2025-26లో 7000 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం మంజూరు చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటికే 1,450 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించేందుకు పరిపాలన అనుమతులు లభించాయని తెలిపారు. పరిపాలన అనుమతులు వేగంగా లభిస్తున్నాయని, కంపెనీలు కూడా పైపులు, ఇతర పరికరాలు జాప్యం లేకుండా సరఫరా చేయాలని పేర్కొన్నారు. పరికరాల నాణ్యతలో ఏవైన తేడాలు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పత్తి, మిర్చి, ఉల్లి, ఆయిల్‌పామ్ పెద్ద ఎత్తున సాగు అవుతున్నాయని, ఈ పంటలకు డ్రిప్ సదుపాయం కల్పించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. పరికరాలు అమర్చడం ద్వారా డ్రిప్ సదుపాయాన్ని వెంటనే సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ అదనపు పీడీ పిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి.. అనంతలోకాలకు


లక్ష్మన్న(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: బంధువుల ఇంట్లో వివాహానికి వచ్చాడు. అర్ధరాత్రి వరకు సంబరాల్లో పాల్గొన్న ఆ యువకుడు ఆదోనికి వెళ్లి వస్తానని బైక్‌పై బయలుదేరి మృత్యుఒడికి చేరాడు. మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. ఆదోని పట్టణంలోని ఇంద్రానగర్ ఎరుకుల కాలనీకి చెందిన మారెన్న కుమారుడు ఎరుకుల లక్ష్మన్న(28) కొంత కాలంగా హైదరాబాద్‌లో వెంట్రుకల వ్యాపారం, ఆదోనిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని తమ బంధువుల పెళ్లికి భార్య మాధవితో కలిసి వచ్చాడు. రాత్రి పెళ్లి కుమారుడి ఇంటి దగ్గర డీజే పాటలకు నృత్యం చేస్తూ అందరితో సంతోషంగా గడిపాడు. భార్య, బంధువులు వద్దని వారించినా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆదోనికి వెళ్లి ఉదయం వస్తానని బుల్లెట్ బైక్‌పై బయలుదేరాడు. మండల పరిధిలోని కోటేకల్ - ఆరేకల్ గ్రామాల మధ్య ఉన్న కోళ్ల ఫారం దగ్గర బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదల్లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి విషయాన్ని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకొని మృతుడి దగ్గర ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యుల సమాచారం తెలుసుకుని ప్రమాదం విషయం తెలియజేశారు.

యువకుని అవయవ దానం

- ముగ్గురికి కొత్త జీవితం


శివరామ సుబ్బయ్య (ఫైల్)

కర్నూలు (హాస్పిటల్): ఒక యువకుడు చేసిన అవయవ దానం ముగ్గురికి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం పెద్దకొప్పెర్ల గ్రామానికి చెందిన టి.శివరామ సుబ్బయ్య (39)కు భార్య రామసుబ్బమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన ఈనెల 10న స్నేహితులతో కలసి దగ్గర్లోని నదికి చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ జారిపడటంతో తలకు పెద్ద రాయి తగిలి తీవ్ర గాయమైంది. వెంటనే అతను జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిస్థితి బాగోలేదని చెప్పి కర్నూలుకు పంపారు. అదే రోజు ఓమ్నీ హాస్పిటల్‌లో చేర్చి వెంటిలేటర్‌పై ఉంచారు. మెరుగైన చికిత్స కోసం మరుసటి రోజు మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. కానీ అతనిని బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. ఆసుపత్రిలోని జీవన్‌దాన్ ట్రస్టు వారు అవయవ దానం గురించి శివరామ సుబ్బయ్య కుటుంబానికి చెప్పగా వారు అంగీకరించారు. కర్నూలు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ సాయిసుధీర్ నేతృత్వంలో డాక్టర్ అబ్దుల్ సమద్, డాక్టర్ సిద్ధార్థ హెరూర్, డాక్టర్ బి.ప్రవీణ్, డాక్టర్ శరత్ తదితరులు అవయవాలను సేకరించారు. సేకరించిన అవయవాల్లో ఒక కిడ్నీని నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు, మరో కిడ్నీని మెడికవర్ హాస్పిటల్‌లోనే ఒక రోగికి, కాలేయాన్ని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబాన్ని ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ గూండాగిరీకి పోలీసుల వత్తాసు

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న గూండాగిరీకి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని, ఇందుకు జెడ్పీటీసీ ఉప ఎన్నికలే నిదర్శనమని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. కూటమి సర్కారు ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మండిపడ్డారు. బుధవారం ఆలూరు ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. దౌర్జన్యాలు చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఈ ఆగడాలను అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ, ఎన్నికల కమిషన్ ప్రేక్షక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలో రౌడీరాజ్యం ఎన్నాళ్లు ఉండదని, ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, పార్టీ ఆలూరు మండలం అధ్యక్షుడు మల్లికార్జున, ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

నంద్యాల: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని గుడిమెట్ట వద్ద మద్దయ్య(42) అనే వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఈయన ఈనెల 11న కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లారు. అక్కడ అమ్మవారిని దర్శించుకొని మంగళవారం రాత్రి రైలులో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుడిమెట్ట వద్ద రైలు నుంచి జారి కింద పడి మృతి చెందినట్లు బుధవారం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.


ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో బ్రహ్మజెముడు మొక్క

మన పండు బ్రహ్మాండం!





డ్రాగన్ ఫ్రూట్. ఇటీవల కాలంలో విచ్చలవిడిగా లభిస్తున్న పండు. ఇదివరలో చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నా.. ఇప్పుడు మన పక్క జిల్లా అనంతపురంతో పాటు పలు జిల్లాల్లో విరివిగా సాగవుతోంది. అయితే ఇంతకు వెయ్యి రెట్లు బీ12, ఏ, సీ విటమిన్లు లభించే మొక్క మన దేశంలోనే ఉన్న బ్రహ్మజెముడు(పాపిచ్చి కాయ)ను విస్మరిస్తున్నాం. చైనాకు, మన పండుకు ఉన్నా తేడా ఒక్క ముళ్లు మాత్రమే. కేవలం ఈ ఒక్క కారణంతో ముళ్లు తీసుకునే సమయం లేక చైనా పండ్లను ప్రోత్సహిస్తున్నాం. పైగా ఈ పండ్లు గ్రామీణ ప్రాంతాల్లోని కొండ ప్రాంతాల్లో ఎవరూ పెంచకుండానే మొండిగా బతికేస్తుంది. అయితే చైనా పండు(డ్రాగన్ ఫ్రూట్)ను మాత్రం కేజీ రూ.100 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇక్కడే ఫ్రీగా లభిస్తున్న, డ్రాగన్ ఫ్రూట్‌ను మించి పోషకాలను అందిస్తున్న మన బ్రహ్మజెముడును పట్టించుకోకపోవడం గమనార్హం. కార్పొరేట్, కాంక్రీట్ జంగిల్స్‌లో విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు వీటి గురించి అవగాహన లేకపోయినా.. గ్రామీణ ప్రాంతాల్లో సర్కారు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఈ పాపాసికాయలు తెలియనివి కావు. పండును బండరాయికేసి రుద్దితే ముళ్లు విరిగిపోతాయి, ఆ తర్వాత తోలు తీసి గుజ్జును తినేయడమే. చివరగా వచ్చే విత్తనాలను మాత్రం పడేయటం విస్మరించొద్దు. ఈ పండ్లు తిన్నామంటే ఎట్టే గుర్తుపట్టేయొచ్చు. చేతులు, నాలుక కొద్ది సమయం వరకు ఎరుపు, గులాబి రంగులోకి మారిపోవడం చూస్తే పాపాసికాయలు తిన్నావా అని అడగాల్సిందే. ఔషధ గుణాలు కలిగిన బ్రహ్మజెముడు పండ్లతో కాలేయ, క్యాన్సర్ వ్యాధులను సైతం నయం చేస్తోంది. అంతేకాదు.. స్థూలకాయం, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలను కూడా తగ్గించే గుణం ఉండటం విశేషం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కర్నూలులో కేజీ రూ.100 చొప్పన విక్రయిస్తున్న డ్రాగన్ ఫ్రూట్

మద్యం బార్లకు అధిక దరఖాస్తులొచ్చేలా చూడండి

- ఎక్సైజ్ నేర సమీక్ష సమావేశంలో నోడల్ డిప్యూటీ కమిషనర్


ఎక్సైజ్ నేర సమీక్ష మాట్లాడుతున్న డీసీ శ్రీదేవి

కర్నూలు: మద్యం బార్ల పాలసీ నెలాఖరుకు ముగుస్తున్నందున కొత్త పాలసీ గురించి వ్యాపారులకు వివరించి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చేలా చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చూడాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి ఎక్సైజ్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక డీసీ కార్యాలయంలో బుధవారం కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున ఇందుకు సంబంధించి మద్యం వ్యాపారుల నుంచి రుసుం వసూలు చేయాలన్నారు. లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు ఉన్న దుకాణాల నుంచి రూ.5 లక్షలు, రూ.65 లక్షలకు పైగా లైసెన్స్ ఫీజు ఉన్న దుకాణాల నుంచి ఏడాదికి రూ.7.50 లక్షలు పర్మిట్ రూమ్‌లకు రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే నాటుసారాను సమూలంగా నిర్మూలించడానికి ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంపై చర్చించారు. కర్నూలును సారా రహిత జిల్లాగా నెలాఖరుకు ప్రకటించాల్సి ఉన్నందున ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, ఎక్సైజ్ కర్నూలు, నంద్యాల జిల్లా అధికారులు మచ్చ సుధీర్ బాబు, రవి కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణా రెడ్డి, రాముడు, రాజశేఖర్ గౌడు, సీఐలు చంద్రహాస్, రాజేంద్ర ప్రసాద్, జాన్ సైదులు మంజుల, రమేష్ రెడ్డి, లలితా దేవి, స్వర్ణలత, రామాంజినేయులు, మోహన్ రెడ్డి, విజయ్ కుమార్, వరలక్ష్మి, సతీష్ తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


సూర్య (ఫైల్)

నంద్యాల: ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పాణ్యం మండలం కౌలూరు గ్రామ సమీపంలోని రైలు పట్టాల మధ్య మృతదేహం లభించింది. రైల్వే పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన రామసుబ్బయ్య కుమారుడు సూర్య (23) డిగ్రీ చదివి ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్‌కెళ్లాడు. ఇటీవలే అక్కడి నుంచి స్వగ్రామానికి వచ్చిన ఆ యువకుడు పని ఉందంటూ రెండు రోజుల క్రితం నంద్యాలకు వచ్చారు. ఏమైందో ఏమో తెలియదు కానీ కౌలూరు సమీపంలో రైల్వే పట్టాలపై శవమై కనిపించాడు. రైల్వే పోలీసులు గుర్తించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా మృతుడు ఓ యువతిని ప్రేమించాడని..అయితే ఇరువురి కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదని సమాచారం. ఈ క్రమంలో యువకుడి మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా చంపేసి అక్కడ పారవేశారా లేక ప్రేమ విఫలమై యువకుడే ఆత్మహత్య చేసుకున్నాడా అన్నది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. తమ కుమారుడిది హత్యేననివిచారించి న్యాయం చేయాలని సూర్యతల్లిదండ్రులు కోరుతున్నారు.

మళ్లీ మొదటికొచ్చిన వీఏఏల బదిలీలు

బదిలీలను రద్దు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు

- 115 మందికి ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు
- రూ.16లక్షల వరకు వసూలు చేసిన కూటమి నేతలు
- ప్రత్యేక కౌంటర్ తెరిచిన కొందరు అధికారులు
- నిబంధనలకు లోబడి బదిలీలు చేపట్టాలని హైకోర్టు ఆదేశం



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ) బదిలీల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. బదిలీల్లో అన్యాయంపై సుమారు 40 మంది వీఏఏలు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు మూడు వారాల క్రితం ఎక్కడి వారిని అక్కడే కొనసాగించాలని స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. ఆరు జిల్లాల నుంచి కోర్టును ఆశ్రయించగా.. ఉమ్మడి కర్నూలు, కృష్ణా జిల్లాల బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు హైకోర్టు నిర్ధారించింది. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో బదిలీల కౌన్సెలింగ్ తిరిగి చేపట్టాలని ఈనెల 11న ఆదేశించడం గమనార్హం.

చేతులు మారిన రూ.16లక్షలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 474 మంది వీఏఏలు ఉండగా 447 మందిని బదిలీ చేశారు. రేషనలైజేషన్ వల్ల ఉమ్మడి జిల్లాలో 188 రైతుభరోసా కేంద్రాలు మూత పడ్డాయి. ప్రధానంగా నంద్యాల జిల్లాలో 117 ఆర్‌బీకేలు మూతపడ్డాయి. ఈ కారణంగా చాలామంది వీఏఏలు కర్నూలు జిల్లాకు అలాట్ అయ్యారు. అయితే బదిలీల్లో ముడుపులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.16లక్షలు చేతులు మారినట్లు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతోంది. బదిలీలకు సంబంధించి విడుదల చేసిన జీఓ(23, 5)లను ఏమాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చిన్న ఉద్యోగులనూ దోచుకున్నారు

గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ) బదిలీల్లో రాజకీయ సిఫారసులకే పెద్దపీట వేశారని తెలుస్తోంది. కూటమి పార్టీల నేతలు చిన్న ఉద్యోగులను కూడా వదలకుండా అందినకాడికి వసూలు చేసుకొని సిఫారసు లేఖలు ఇచ్చినట్లు సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలు ప్రకారం వసూలు చేసినట్లు చర్చ జరుగుతోంది. ఏకంగా 115 మంది వీఏఏలు ప్రజాప్రతినిధుల సిఫారసుతో కోరుకున్న చోటుకు బదిలీ అయినట్లు హైకోర్టు గుర్తించింది. సిఫారసులు లేకుండానే కొరుకున్న చోటుకు బదిలీ చేసినందుకు కొందరు అధికారులు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ముడుపుల వసూళ్లలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ ఏఓల్లో ఒకరు కీలకంగా వ్యవహరించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అభాసుపాలైన వ్యవసాయ శాఖ

ముడుపులు ఇచ్చుకొని కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకున్నాం.. మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహిస్తే తమ పరిస్థితి ఏమిటని వీఏఏల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. డబ్బులు పోయి, తిరిగి పోస్టింగ్ ఆ ప్రాంతానికే వస్తుందో రాదోననే కొందరు వీఏఏలు సతమతం అవుతున్నారు. ఇటీవల చేపట్టిన మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు, డీడీఏల బదిలీలతో వ్యవసాయ శాఖ అభాసుపాలైంది. గ్రామస్థాయిలోని వీఏఏల బదిలీల్లో సైతం ముడుపుల వ్యవహారం ఈ శాఖ పరువును బజారున పడేసింది.